

రిటైర్డ్ ఎంపీడీవోకు పెన్షన్ కోత

● అవినీతి ఆరోపణలు నిరూపితం

శ్రీకాకుళం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఎంపీడీవో బెహరా వెంకటరమణపై ఉన్న అవినీతి ఆరోపణలు నిర్ధారణ అయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంది. వెంకటరమణకు రెండేళ్లపాటు పెన్షన్‌లో ఐదు శాతం కోత విధిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ శుక్రవారం **(మిగతా 6వ పేజీలో..)**



ప్లీజ్.. ఒక్క క్షణం

● క్షణికావేశంలో విద్యార్థులు, యువత ఆత్మహత్య
● చిన్నపాటి కారణాలకే తనువు చాలిస్తున్న వైనం
● తల్లిదండ్రులు, బంధువులకు తీరని శోకం



● నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ గెడ్డయ్య పేటకు చెందిన **మొగిలి దివ్య** (16).. ఇటీవల గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. ఈ నెల 10న మృతి చెందింది. ఈ విద్యార్థిని జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతోంది. కాగా.. మద్యానికి బానిసైన తండ్రిని మార్చాలని భయపెట్టేందుకు ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. చివరికి ప్రాణాలు కోల్పోయింది.



● గార మండలం కొర్లాం గ్రామానికి చెందిన **చల్ల చిన్న సంపత్** (31) ఎంబీఏ చదివాడు. విశాఖపట్నంలో ఉంటూ మూడేళ్లుగా ఉద్యోగం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 10న ఆత్మహత్య చేసుకున్నాడు.

● గతేడాది ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లోని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు ఇదే క్యాంపస్‌లోని ఓ విద్యార్థిని హాస్టల్ భవనంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

● కొన్నాళ్ల కిందట ఎస్.ఎం.పురం ఏపీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువు తున్న ఓ విద్యార్థి కూడా ఆత్మహత్యకు పాల్పడి కన్నవారికి గుండెకోత మిగిల్చాడు.



ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎంతో మంది విద్యార్థులు, యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు ప్రేరేపితులవుతున్నారు. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. జీవితం అంటేనే పోరాటం. అలుపెరుగని ప్రయాణంలో కష్టాలకోర్చి.. కన్నీళ్లకు తలదించకుండా పోరాడితేనే జీవితం. అప్పుడే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది. కానీ చాలామంది విద్యార్థులు, యువకులు చిన్న చిన్న సమస్యలకే తనువు చాలిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో కొందరు, సీనియర్లు వేధిస్తున్నారని ఇంకొందరు, ఉద్యోగం రాలేదని మరికొందరు, బాగా చదువుకోలేకపోతున్నామని, పోటీ ప్రపంచంలో ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని ఇంకొంతమంది మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు తరచూ జరగడం విచారకరం. మారుతున్న కాలానికి అనుగుణంగా ముందుకు సాగలేక తీవ్రమైన ఒత్తిడి, ఆత్మ న్యూనతా భావం తదితర కారణాలతో **(మిగతా 6వ పేజీలో..)**



● తాజాగా ఈ నెల 12న గుంటూరుకు చెందిన **ప్రత్తిపాటి సృజన్**(20) ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలోని ఆర్జీయూకేటీ (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్)లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సృజన్ ఇక్కడ ఇంజనీరింగ్ ఈఈఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతూ.. సీనియర్ విద్యార్థుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు 8 మంది సీనియర్ విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేయడమే కాకుండా.. వారిని వర్సిటీ అధికారులు సస్పెన్షన్ చేశారు.

కౌన్సెలింగ్‌తో సాధ్యమే..

కొంతమంది యువకులు తమకు ఎలాంటి సమస్య వచ్చినా స్నేహితులతో, ఉపాధ్యాయులతో, చివరకు తల్లిదండ్రులు, తోడబుట్టినవారితో కూడా చెప్పేందుకు ఇష్టపడరు. ఇలాంటి వ్యక్తులు అంతర్ముఖులు(ఇంట్రోవర్ట్)గా ఉండడం వల్ల సమస్యలను తమ మదిలోనే దాచుకుంటూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ముభావంగా ఉండడం, ఎవరితోనూ కలవడానికి ఇష్టపడకపోవడం, ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తుండడం ఇలా కొంతమంది తమ సమస్యకు పరిష్కారం వెతకకుండానే మనసులోనే బాధపడుతుంటారు. ఇలాంటి రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నవారికి తరుచూ కౌన్సెలింగ్ ఇస్తే ప్రయోజనం ఉంటుంది. యాంత్రిక జీవితంలో తీవ్రమైన ఒత్తిడి వల్ల కూడా ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఓ సర్వేలో తేలింది. జీవితం పట్ల సానుకూల దృక్పథంతో ఒక్క క్షణం ఆలోచించినా ఆత్మహత్యలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వ్యాయామం తప్పనిసరి..

ప్రతి విద్యా సంస్థలో క్రీడా మైదానం తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థులకు వ్యాయామం, ఆటలు ఆడించాలి. గ్రంథాలయాన్ని విద్యార్థులు ఎక్కువగా వినియోగించేలా ప్రేరేపించాలి. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా బాధ్యత తీసుకోవాలి. వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. విద్యా బోధనతోపాటు అదనపు పాఠ్య కార్యకలాపాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి. ఎప్పటికప్పుడు విద్యార్థులను చైతన్యపర్చేలా కౌన్సెలింగ్ తరగతులను నిర్వహించాలి. ముఖ్యంగా బాలిక గురుకుల పాఠశాలల్లో ప్రత్యేకంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించాలి. మెరుగైన బోధనతో పాటు విద్యార్థులకు భవితపై బంగారు ఆశలు కలిగేలా చైతన్య పర్చే కార్యక్రమాలను నిర్వహించాలి.



పెద్దపాడు కాలనీలో కురుస్తున్న పొగమంచు



పొగమంచు.. జాగ్రత్త

శ్రీకాకుళం/కోటబొమ్మాళి/అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): శీతాకాలం వచ్చేసింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా.. చలితీవ్రత పెరిగింది. మరోవైపు సిక్కోలును మంచు దుప్పటి కప్పేస్తుండడంతో జిల్లావాసులు గజగజ వణికిపోతున్నారు. ఈ ఏడాది గత నెల, ఈ నెల వరుస అల్పపీడనాల ప్రభావంతో వర్షాలు కురవడంతో మంచు తీవ్రత ఎక్కువైంది. అరసవల్లి, శ్యాంపాలెం, ఒప్పంగి, పెదపాడు, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టంగా కమ్ముకుంటోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శీతాకాలం వేళ.. ఆస్తమా రోగులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 6లో

చలి, మంచులో తిరగరాదు




శీతాకాలంలో కురుస్తున్న పొగ మంచుతో ప్రజలు జాగ్రత్త వహించాల్సిందే. అధికమంది రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్‌కు గురవుతారు. ఆస్తమా, ఉబ్బస రోగులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వేడినీటి తాగాలి. శీతలపానీయాలకు దూరంగా ఉండాలి. చలిలో.. మంచులో తిరగకూడదు. చెవులు, ముక్కును కప్పుతూ ఉన్ని దుస్తులు ధరిస్తే మంచిది. సైనుసైటిస్, అలెర్జీ ఉన్నవారు.. యోగతోపాటు.. రెగ్యులర్ మందులు వేసుకోవాలి. ఇన్‌ఫెక్షన్ ఉంటే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి.

డా. అన్నెపు శశిధర్, ఎం.డి.
శ్రీకాకుళం

బీపీఎస్!

● అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం
● ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ నోటిఫికేషన్
● నిర్మాణదారులకు అవగాహన కల్పించడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాయత్తం



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఏరియా వ్యూ..

పలాస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్)ను ప్రవేశపెట్టింది. రెండురోజుల కిందట పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ దీనికి సంబంధించిన జీఓ నెంబరు 225ను విడుదల చేశారు. దీని ప్రకారం 1985 సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి 2025 ఆగస్టు 31వ తేదీలోగా నిర్మించిన అక్రమ కట్టడాలు చట్టబద్ధం చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో శ్రీకాకుళం కార్పొరేషన్‌తోపాటు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. మొత్తం ఈ ప్రాంతంలో వెయ్యికిపైగా గృహాలు క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో బీపీఎస్ పథకాన్ని ప్రకటించడంతో జిల్లాలో వేలాది గృహాలు క్రమబద్ధీకరించారు. ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ దీన్ని ప్రకటించడం విశేషం.

● వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి నిర్మాణదారులకు ఎటువంటి ఊరట ఇచ్చే ప్రకటనలు చేయలేదు. చిన్నచిన్న పొరపాట్లతో నిర్మించిన భవనాలకు భారీ జరిమానా విధించడంతో నిర్మాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసేవారు. కొన్నిసార్లు మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ అధికారులు కోర్టులో దావాలు వేసి కనీసం 50శాతం అపరాధ రుసుం విధించి అక్రమ కట్టడాలు క్రమబద్ధీకరించారు. అటువంటి వారందరికీ ఊరటనిచ్చే విధంగా కూటమి ప్రభుత్వం మళ్లీ బీపీఎస్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో అక్రమ నిర్మాణదారులు ఆనంద పడుతున్నారు. ప్రభుత్వ భూములు, దేవదాయ, సాగర్, నది, వాగు, గట్లుపై ఉన్న భవనాలకు మాత్రం అనుమతులు ఇవ్వడం జరగదని అధికారులు స్పష్టం చేశారు.

● అక్రమ నిర్మాణదారులు ఈ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే రిజిస్టర్ సేల్‌డీడ్ పత్రాలు, ఈసీ, మార్కెట్ ధర, ప్లాన్, ఇంటి నిర్మాణం ఫొటో, ఇండెంటిటీ బాండ్‌లను ప్రభుత్వం విడుదల చేసిన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. భూమి విలువ ఆధారంగా నగదు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న సమయంలో రూ.10వేలు తప్పనిసరిగా చెల్లించాలి. 120 రోజుల్లోగా నిర్మాణదారులు దీనికి దరఖాస్తు చేసుకోవాలని పట్టణాభివృద్ధిశాఖ ప్రకటించింది.

● ప్రజలకు అవగాహన కల్పించేందుకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. పలాస-కాశీబుగ్గలో వందలాదిగా అక్రమ భవనాలు ఇప్పటికే గుర్తించారు. దీంతోపాటుగా ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన గృహాలను కూడా గుర్తించే పనిలో ఉన్నారు. 2017లో ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు కారణంగా వందకు పైగా గృహాలు క్రమబద్ధీకరణ జరిగాయి. అనంతరం వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు లేకుండా గృహ నిర్మాణాలు జరిగాయి. దీనిపై చర్యలకు ఉపక్రమించినా రాజకీయవత్తిళ్ల కారణంగా అధికారులు మౌనం దాల్చాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వమే అక్రమ భవనాలకు **(మిగతా 6వ పేజీలో..)**

రోడ్డుపైనే ధాన్యం

● ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
● ఇబ్బందిపడుతున్న రైతులు
● దోచుకుంటున్న దళారులు
● పట్టించుకోని యంత్రాంగం 6లో

అవగాహనతో డయాబెటిస్ దూరం

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.మేరీ క్యాథరిన్ 7లో

చెత్త సమస్యకు పరిష్కారం

● ఆధునిక యంత్రాలతో ప్లాస్టిక్ తొలగింపు
● ఎరువుగా మిగిలిన వ్యర్థాలు
● పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రయోగం
● జిందాల్ కంపెనీతో ఒప్పందం

మత్స్యకారుల మధ్య కొట్లాట

● నలుగురికి గాయాలు

లోలుగు కేజీబీవీలో డీఎస్పీ విచారణ

8లో

అమ్మో.. పాము



● జిల్లాలో పెరుగుతున్న పాముకాటు ఘటనలు
● ఆరు నెలల్లో 50 మంది మృతి
● వరి కోతల సమయంలోనే అధికం
● రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



● ఈ నెల 10న జలుమూరు మండలం యాతపేట గ్రామానికి చెందిన **వాడ సింహాచలం** పాముకాటుతో మృతిచెందాడు. పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

● ఈ ఏడాది సెప్టెంబరు 11న ఎల్ఎన్‌పేట మండలం బసవరాజు పేటకు చెందిన **వాన అప్పలనాయుడు** పాముకాటుతో మృతిచెందాడు. పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు హిరమండలం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.



రణస్థలం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాముకాటు బాధితుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత ఆరు నెలల వ్యవధిలో పాముకాటుకు గురై 50 మంది మృత్యువాత పడ్డారు. ఒక్క ఎల్ఎన్‌పేట మండలంలోనే ఈ ఏడాది జూలైలో 26మంది పాముకాటుకు బలయ్యారు. ఎక్కువగా గిరిజనులు, రైతులే బాధితులు. జిల్లాలో ఏటా 2వేల మంది వరకూ పాముకాటుకు గురవుతున్నారు. 400 మంది వరకూ ప్రాణాలు కోల్పోతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా కట్లపాము, రక్తపింజరి, నాగుపాములే ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పొలాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటు వేస్తాయి. అందుకే పొలంలో పనిచేసేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.



వైద్యం అందక.. మూల్యం

పాముకాటు వేసిన వెంటనే సకాలంలో వైద్యసేవలందక ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితుల్లో 70 శాతం మంది నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు. ప్రాణాలు కాపాడే విలువైన సమయాన్ని చేజేతులా జారవిడుస్తున్నారు. పాముకాటుకు విరుగుడుగా ఇచ్చే 'పాలీవేలెంట్ యాంటీ వినమ్' శాస్త్రీయంగా నిరూపితమైన మందు. స్థానికంగా ఉండే పీహెచ్‌సీల్లో యాంటీ వినమ్ అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ చాలా పీహెచ్‌సీల్లో ఉండడం లేదన్న విమర్శ ఉంది. సీహెచ్‌సీలతో పాటు ఏరియా ఆస్పత్రిల్లో యాంటీవినమ్ అందుబాటులో ఉన్నప్పటికీ.. అది మొదటి 5-10 డోసులకే పరిమితమవుతోంది. తరువాత బాధితులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాల్సి వస్తోంది. చికిత్స ఆలస్యం కావడం, విషం తీవ్రత బట్టి డోసుల మోతాదు మారుతూ ఉంటుంది. పాముకాటుకు గురైన బాధితుడికి మూడు గంటల్లోపు శరీరంలో విష తీవ్రత బట్టి యాంటీవినమ్ డోసులను అందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఆపై దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. జిల్లాలో **(మిగతా 6వ పేజీలో..)**

అప్రమత్తంగా ఉండాలి

పాముకాటు వేస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. నాటు వైద్యం అత్యంత ప్రమాదకరం. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. అన్నింటికీ మించి బాధితులు ధైర్యంతో ఉండాలి. పాముకాటు వేసిన వెంటనే విష ప్రసరణ జరగకుండా అడ్డుకట్ట వేయాలి. తాడుతో గాయాన్ని కట్టి వేయాలి. పాముకాటు వేసిన మూడు గంటల్లో ఇంజక్షన్ అందిస్తే ప్రాణాపాయం ఉండదు. ప్రభుత్వాస్పత్రిలో యాంటీ వీనమ్ డోసులు అందుబాటులో ఉంటాయి.

- డాక్టర్ యుగంధర్, కొండములగాం సీహెచ్‌సీ, రణస్థలం

రెండున్నరేళ్లు.. అప్పుడే బీటలు

● దెబ్బతిన్న టెక్కలిపట్నం - చిన్నహంస రహదారి

మెళియాపుట్టి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యతాలోపం కారణంగా టెక్కలిపట్నం- చిన్నహంస రహదారి దుస్థితి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. పనులు చేపట్టి.. రెండున్నరేళ్లకే ఈ రహదారి పాడైపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పూర్తిగా పాడైంది. ప్రయాణికులు ఆందోళన చేయడంతో రహదారి నిర్మాణానికి సుమారు రూ.1.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 2023 మే నెలలో టెక్కలిపట్నం నుంచి చిన్నహంస వరకు రహదారి పనులు చేపట్టారు. నాడు బిల్లులు మంజూరైనా పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఈ రహదారి ఎక్కడికక్కడ గుంతల మయంగా మారింది. జర్రిభద్ర నుంచి చొంపపురం వరకు కిలోమీటర్ పరిధిలో ఐదు గుంతలు ఏర్పడ్డాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. తారు తక్కువగా వాడడంతో రోడ్డు బీటలు వారిందని తెలిపారు. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఈ గుంతలను పూడ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాళ్లుతేలి దెబ్బతిన్న టెక్కలిపట్నం- చిన్నహంస రహదారి

పొగమంచు.. జాగ్రత్త

- 17 డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- ఆస్తమా రోగులు, వృద్ధుల అవస్థలు
- అప్రమత్తత మేలంటున్న వైద్యులు



అరసవల్లి రోడ్డులో మంచులో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

శ్రీకాకుళం/కోటబొమ్మాళి/అరసవల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి)

గడచిన నాలుగు రోజులుగా చలితీవ్రత పెరిగింది. రాత్రి పది గంటల తరువాత తెల్లవార్లూ పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం ఏడు గంటల వరకూ ఇదే పరిస్థితి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధానంగా ఆస్మా రోగులు, వృద్ధులు, చిన్నారుల వెతలు వర్ణనాతీతం. పొగమంచు ప్రభావం ప్రజలతో పాటు పంటలు, పశుపక్ష్యాదులపై కూడా తీవ్రంగానే పడుతోంది. కోటబొమ్మాళి మండలంలోని దంత, కురుడు, రామయ్యపేట, చీపుర్లపాడు, యలమంచిలి తదితర గ్రామాల్లో ఎక్కువగా కొండలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తోంది. రాత్రివేళ 17 నుంచి 18 డిగ్రీలు మాత్రమే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి

రోగుల వెతలు..

చిన్నారులు, వృద్ధులతో పాటు ఆస్మారోగులు ఓవైపు చలికి మరోవైపు పొగమంచు ప్రభావంతో అల్లాడిపోతున్నారు. పొగమంచుకు రోగాలబారిన పడుతున్నారు. ఉదయం సూర్యకిరణాలు దట్టంగా ప్రసరించే వరకూ ఆస్మా రోగులు బయటకు వెళ్లకూడదని, రాత్రివేళ త్వరగా ఇళ్ల చేరాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూజ్వరం, ఆయాసం, స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతాయి. ఆస్తమా, పీవోపీడీ, అలర్జీ, న్యూమోనియా తదితర శ్వాసకోశ వ్యాధులు ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యాధులతో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

వాహన చోదకులూ పరాక్..

పొగమంచు ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారం ఉంది. ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించని విధంగా మంచు కురుస్తుండడంతో జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. పొగమంచు కురిసేటప్పుడు మరీ అత్యవసరమైతే తప్ప వాహనాలతో బయటకు వెళ్లకూడదని అధికారులు చెబుతున్నారు. చిన్నచిన్న పట్టణాలకు పక్కన పెడితే జాతీయ రహదారిలో రోజంతా తిరిగే వాహనాల డ్రైవర్లు మాత్రం జాగ్రత్తగా ముందుకు వెళ్లాలంటున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలే ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. రాత్రి పొద్దుపోయాక, మంచు దట్టంగా కురిసే సమయాలలో పెద్ద వాహనాలను నిలిపివేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలతో ప్రయాణించకూడదని చెబుతున్నారు. హైవేపై భారీ వాహనాలను పోలీసులు ఆపి డ్రైవర్, అదనపు డ్రైవర్ ముఖం కడుక్కుని ముందుకు సాగేలా చర్యలు ప్రారంభించారు.

- చల్లటి గాలులలకు శరీరం తెల్లగా పొడిబారినట్టు మారిపోతుంది. పెదవులు పగిలిపోయి ముఖం కాంతిహీనంగా మారుతుంది. అరికాళ్ల పగుళ్ల ఏర్పడతాయి. శరీరంతో తేమశాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయి. ఈ తరహా సమస్యలు దీర్ఘకాలిక రోగుల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుంది. వాతావరణం మార్పుతో మరోవైపు ప్రజలు దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో వారం నుంచి రెండు వారాల పాటు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. న్యూమోనియా, ఆస్తమా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా సమస్య పెరుగుతుంది. ఆస్తమా, న్యూమోనియా బాధపడేవారు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

వేడినీరు తాగాలి..

చెవి, ముక్కు, గొంతు సమస్యలున్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకొని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానియాలు, ఐస్ క్రీమ్‌లు, తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్నవారు రోజూ రెండుసార్లు వేడిచేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కలించి ఉమ్మివేయాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తల్లడిల్లుతున్న ఆస్తమా రోగులు

జిల్లా అంతటా ఆస్మా రోగులు తల్లడిల్లిపోతున్నారు. నవంబరు మొదలు ఫిబ్రవరి మొదటి వారం వరకూ చలి, మంచుతో ఇబ్బందులు పడుతున్న ఆస్మా రోగులు పొగమంచు పుణ్యమాని మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ ప్రభావంతో ఆయాసం ఎక్కువై, ఊపిరాడని పరిస్థితులు నెలకొంటున్నాయి. పాల ఉబ్బసతో బాధపడుతున్న చిన్నారులు సైతం తల్లడిల్లిపోతున్నారు.

ఈ ఏడాది చలి ఎక్కువే..



గతేడాది కంటే ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 9 గంటల వరకు చలి ఉండటంతో బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. పండించిన కూరగాయలు విక్రయించేందుకుగాను.. వేకువజామున శ్రీపురం మార్కెట్‌కు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం.

-ఎస్.ఆనందరావు, కూరగాయల రైతు, ఊడికలపాడు, కోటబొమ్మాళి

జాగ్రత్తలు తప్పనిసరి..



చలికాలంలో చిన్నపిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్లలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే.. పిల్లలు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. మంచు పడే సమయంలో పిల్లలను బయటకు తీసుకెళ్లరాదు. తప్పనిసరి అయితే స్వెటర్లు, మంకీక్యాప్‌లు వేయాలి. ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిల్లల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తరచూ జలుబు, దగ్గు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి.

-డాక్టర్ పి.గణేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్, కోటబొమ్మాళి

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..



పొగమంచు... తీవ్రచలి.. చల్లగాలులకు ముఖ్యంగా చిన్నపిల్లలు ప్రభావానికి గురయ్యే అవకాశముంది. పిల్లలను బయటకు తీసుకువెళ్లినా.. స్వెటర్‌లు ధరించేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. అలర్జీ.. తరుచూ జలుబు... దగ్గు.. ఇతరత్రా సమస్యలున్నవారు.. మంచు ప్రభావం తగ్గాక బయటకు వెళ్లాలి. ఐస్‌క్రీమ్‌ను అస్సలు పిల్లలకు ఇవ్వొద్దు. ప్రతిరోజు సుమారు సూర్యరశ్మి కనీసం ఇరవై నిముషాలు శరీరానికి తగిలేలా చూడాలి.

-డా.బి.రామకోటేశ్వరరావు, చిన్నపిల్లల వైద్యనిపుణులు, శ్రీకాకుళం



వప్పంగిలో కురుస్తున్న మంచు



కోటబొమ్మాళిలో కురుస్తున్న మంచు

ప్లీజ్.. ఒక్కక్షణం

(ఐదో పేజీ తరువాయి)

ఆత్మహత్యలు ప్రేరేపిస్తున్నాయని మానసిక వేత్తలు చెబుతున్నారు. బలన్మరణాలను ఆపేందుకు కౌన్సెలింగ్ వల్ల సాధ్యమవు తుందని పేర్కొంటున్నారు. క్షణికావేశం నుంచి ఆలోచనలను కొద్ది సేపు మళ్లించగలిగితే.. ఎప్పుడు అలాంటి ప్రయత్నం జోలికి వెళ్లే అవకాశం ఉండదని అంటున్నారు.

మనోభావాలను తెలుసుకోవాలి



పరిమిత కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, ఆర్థిక వనరులు సరిగా లేకపోవడం, విపరీత ఒత్తిడి, సాంఘిక వెనుకబాటుతనం, పోటీ ప్రపంచం, ఆరోగ్య సమస్యలు ప్రధాన కారణంగా గుర్తించాలి. వ్యక్తి ప్రవర్తనలో మార్పు, ఆందోళన, దిగులు చెందడం, ముభావంగా, చిరాకుగా, కన్నీళ్లు ఆపుకోలేకపోవడం, భవిష్యత్‌పై ఆశలేకపోవడంతో ఇలాంటి అఘాత్యానికి పాల్పడుతున్నారు. వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారి మనోభావాలను తెలుసుకుని సానుభూతితో మెలగాలి. సమస్యలు ఉంటే వాటిపై చర్చను వాయిదా వేయాలి. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, నలుగురితో వివాద రహిత విషయాలు చర్చించే దిశగా అడుగులు వేయడం తదితర చర్యలు అవసరం. అవకాశం ఉంటే వెంటనే మానసిక వైద్యున్ని సంప్రదించడం మంచిది.

-డాక్టర్ ఎన్ఎన్ రాజు, పూర్వ జాతీయ అధ్యక్షుడు, భారత మానసిక వైద్య సంఘం, విశాఖపట్నం

బీపీ'ఎస్'!

(ఐదో పేజీ తరువాయి)

క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవడంతో మొత్తం అటువంటి భవనాలన్నీ క్రమబద్ధీకరణకు నోచుకోనున్నాయి.

- ఈ వ్యవహారంపై టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రేమ్‌కుమార్‌ను వివరణ కోరగా 'ప్రభుత్వం రెండు రోజుల కిందట బీపీఎస్ జీవో విడుదల చేసింది. దీన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్తాం. అక్రమ భవననిర్మాణదారులకు స్కీమ్ ఉపయోగాలు తెలిపి వారితో వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తామ'ని తెలిపారు.

రిటైర్డ్ ఎంపీడీవోకు పెన్షన్ కోత

(ఐదో పేజీ తరువాయి)

ఉత్తర్వులను జారీ చేసింది. అక్రమ ఆస్తులకు సంబంధించి 2011 జూన్ 30న కొత్తూరులో జరిగిన ఏసీబీ అధికారుల విచారణలో వెంకటరమణ తన ఆస్తి వివరాలు పూర్తిగా సమర్పించలేదని విచారణలో తేలింది. ఇది ప్రభుత్వ ఉద్యోగులపై వర్తించే ఏపీసీఎస్ కాండక్ట్ రూల్స్‌కు విరుద్ధమని, ఆయనపై అవినీతి ఆరోపణలు నిజమేనని విచారణ అధికారి నివేదికలో పొందుపరిచారు. దీంతో ప్రభుత్వం ప్రాథమికంగా పింఛన్ కోత విధించాలని నిర్ణయించి.. అధికారిని వివరణ కోరింది. ఆయన ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడంతో తుది నిర్ణయం తీసుకుంది. రెండేళ్లపాటు పెన్షన్‌లో ఐదు శాతం కోత విధిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

పుస్తక మహోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శనలు



జీవనగానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అట్టాడ అప్పలనాయుడు



అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం..



చిన్నారావు మాస్టారు.. జాలారి జానపద ముఖాభినయం



దుర్యోధన మాస్టారు ఏకపాత్రాభినయం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో శుక్రవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురమనిపించాయి. ప్రముఖ రచయిత అట్టాట అప్పలనాయుడు జీవనగానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. దుర్యోధన ఏకపాత్రాభినయంతో ప్రజల నుంచి తామరాపల్లికి చెందిన దివ్యాంగ మాస్టారు అభినందనలు అందుకున్నారు. జాలారి జానపద ముఖాభినయం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం, పల్లెటూరి చిన్నోడు, మిమిక్రీ ప్రదర్శన, ప్లాస్టిక్ భూతంపై లఘు నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ రచయిత డా. భారతిని ప్రముఖ కవి, రచయిత అట్టాల అప్పలనాయుడు సత్కరించారు.



ప్లాస్టిక్ భూతం లఘునాటిక ప్రదర్శన

అమ్మ కదా!

- ఓ తల్లి జీవన పోరాటం



తన పాపను ఆలిస్తూ.. లాలిస్తూ..

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'అమ్మ ఒకవైపు.. దేవతలంతా ఒకవైపు' అని ఓ కవి అన్నట్లు ఆ తల్లి బతుకు భారాన్ని మోస్తూ తన చిన్నారిని ఆడిస్తూ తల్లి మనసును చాటుకుంది. విశాఖపట్నానికి చెందిన షేక్ వహీదా తాతలు, తండ్రుల నుంచి వంశపారంపర్యంగా వస్తున్న వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తోంది. రోడ్డు పక్కన రంగుల బెలూన్లు, చిన్నపిల్లల ఆటబొమ్మలు విక్రయి స్తోంది. అరసవల్లి ఆదిత్యుని ఆలయానికి వెళ్లే రోడ్డులో ఒక వైపు చిన్నారిని లాలిస్తూ, మరో వైపు విక్రయిస్తూ నిమగ్నమైన చిత్రాలు చూపరుల హృదయాలను కదిలించాయి.



బెలూన్లు, బొమ్మలు విక్రయిస్తూ.. వహీదా

అమ్మో.. పాము

(ఐదో పేజీ తరువాయి)

60పీహెచ్‌సీలతో పాటు 104 వాహనాలు 55 ద్వారా ప్రజలకు వైద్యసేవలందుతున్నాయి. వీటిలో పూర్తిస్థాయిలో యాంటీవీనమ్ మందును అంబాటులో ఉంచితే పాముకాటు మృతుల సంఖ్యను తగ్గించవచ్చు.

ఇవి చేయాలి..

- పాముకాటు బారినపడకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో వస్తువులు, ధాన్యం రాశులు, సంచులు తదితర వాటిలో మురుగు లేకుండా చూసుకోవాలి.
- పిల్లలను పుట్టలు, గుట్టలు దగ్గర ఆటలు ఆడకుండా చూసుకోవాలి.
- రైతులు తమ పశువుల శాలల్లో పశువులను కట్టినప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పొలాలకు వెళ్లినప్పుడు చేతిలో కర్రతో పాటు వినికిడి శబ్దాలు చేసే పరికరాలు తమ వద్ద ఉంచుకోవాలి.
- రాత్రి, తెల్లవారుజాము సమయంలో పొలాలకు వెళ్లే వారు విధిగా తమవెంట టార్చ్‌లైట్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- మట్టి, పెంకుటిళ్లకు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.

రోడ్డుపైనే ధాన్యం

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- ఇబ్బందిపడుతున్న రైతులు
- దోచుకుంటున్న దళారులు
- పట్టించుకోని యంత్రాంగం



నగిరికటం వద్ద రోడ్డుపై ఆరబెడుతున్న ధాన్యం



నరసన్నపేట: కంబకాయి జంక్షన్ నుంచి గొట్టిపల్లి జంక్షన్ వరకు గల సర్వీస్ రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

జలుమూరు/నరసన్నపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు జల్లుకున్ననాటి నుంచి ధాన్యం చేతికంది.. వాటిని విక్రయించేవరకు రైతుల కష్టాలు వర్ణణాతీతం. నిన్న, మొన్నటి వరకు తుఫాన్ల దెబ్బకు కుదేలైన రైతులు.. కొద్దో గొప్పో చేతికందిన పంటను విక్రయించుకోవడానికి ఇప్పుడు నానా కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి సరైన సహకారం లేకపోవడంతో దళారులు దోచుకుంటున్నారు. పది రోజులు పైబడి వరిపంట కోతలు ప్రారంభమైనా నేటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో పండిన పంటను రక్షించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేనాథుడు లేకపోవడంతో నిల్వ చేయడానికి సరైన స్థలాలు లేక రోడ్డుపక్కనే ఆరబెట్టుకుని నిల్వ చేసుకుంటున్నారు. ఇదే అదునుగా దళారీలు రైతులను దోచుకుంటున్నారు. 80 కిలోల బస్తా రూ.1325లకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. దీనిపై జలుమూరు తహసీల్దార్ జె.రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుందన్నారు. అయితే మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు చెల్లించకపోవడంతో కొంతమేర ఆలస్యమైందన్నారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.



అచ్యుతాపురం వద్ద విక్రయించేందుకు సిద్ధమైన ధాన్యాన్ని రోడ్డు పక్కనే నిలువ చేసిన దృశ్యం

జిల్లాలో ఇలా..

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 406 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఒక్కటి కూడా ప్రారంభం కాలేదు. నరసన్నపేట, సారవకోట, జలుమూరు, పాతపట్నం మండలాల్లో యంత్రాలతో కోతలు పది రోజులుగా జరుగుతున్నాయి. కళ్లాలు లేకపోవడంతో పచ్చి ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబెడుతున్నారు. వ్యవసాయమార్కెట్ కమిటీలు ఉన్నా ఎటువంటి ప్రయోజనం లేకపోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

భారత తొలి ప్రధాని చాచా నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాస: రైల్వే స్టేషన్‌లో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ అధికారులు



కాశీబుగ్గ: చినబాడం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన



పాతపట్నం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేషధారణలో బాలబాలికలు



వజ్రపుకొత్తూరు: హుకుంపేట పాఠశాలలో నెహ్రూ వేషధారణలో చిన్నారులు



కంచిలి: మఖరాంపురం ఆదర్శ పాఠశాలలో బాలల హక్కులపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చట్టాలపై అవగాహన అవసరం

● జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసర మని జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియం, న్యూసెంట్రల్ స్కూల్‌లో బాలల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గుడ్ టచ్, బాడ్ టచ్‌లను తెలియజేశారు. ఆడపిల్లలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే తమ సంస్థ తగు న్యాయ సహాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, జిల్లా బాలల సంరక్షణాధికారి రమణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

న్యూస్ బాక్స్

17న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తొగరాం సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన వీసీబీ ఏర్పాటు కోసం ఈనెల 17న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తొగరాం, దూసిపేట, కొర్లకోట, జీకేవలస, నిమ్మతొర్లాడ, పాతూరు, కొరపాం, హనుమంతుపురం, చీమలవలస, పీర్‌సాహెబ్‌పేట, కలివరం, తమ్మయ్యపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

విద్యాపరికరాలు పంపిణీ

కంచిలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జాడుపూడి కస్తూర్బా గాంధీ పాఠశాలకు సోంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాపరికరాలు, 14 కుర్చీలను శుక్రవారం అందజేశారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జామి ఈశ్వరరావు, బెల్లాన సుమన్, టి.క్రాంతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణీకుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత

సోంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేరళ అయ్యప్పస్వామి దేవాలయంలో స్వాములకు నిత్యాన్న దానం చేసేందుకు హరిహరపుత్ర చిన్ముద్ర సేవాసమితిని ఏర్పాటు చేసింది. ఈ మేరకు మందస మండలం ముకుంద పురానికి చెందిన సత్యం గురుస్వామి ఆధ్వర్యంలో 40 బస్తాల బియ్యాన్ని లక్కవరం రాజు గురుస్వామికి శుక్రవారం అందజేశారు.

ప్రజా అవసరాలకే ప్రాధాన్యం

జి.సిగడాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజావసరాల మేరకు ఉపాధి పనుల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఏపీవో సీహెచ్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం శేతుభీమవరం, పెంట గ్రామాల్లో ఉపాదిధి గ్రామసభలను నిర్వహించారు. 2026-27 ఆర్థిక సవంత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులను గుర్తించామన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎ.దురారావు, టీఏలు లక్ష్మణరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బూర్జ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నకురింపేట గ్రామంలో కత్తెర తారకేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే రవికుమార్ కృషితో మృతుడి కుటుంబానికి రూ.1.46 లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ఈ చెక్కును శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, పార్టీ నాయకులు కత్తెర నరసింగరావు, లంక జగన్నాథంనాయుడు, అశోక్‌కుమార్, గుర్రాన విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బిహార్‌లో విజయంతో బీజేపీ సంబరాలు



రామతీర్థం జంక్షన్ వద్ద నినాదాలు చేస్తున్న కూటమి నాయకులు

రణస్థలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి సాధించిన అద్భుత విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నేతలు సంబరాలు చేశారు. రామతీర్థం జంక్షన్ వద్ద క్యాడర్ బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తంచేశారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో పార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసి డెంట్ మంగి లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు సాలిన ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

రణస్థలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రణస్థలం పంచా యతీ నగర ప్పాలెం సమీపంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధిత యాజమాన్యం శుక్రవారం సిద్ధం కాగా విషయం తెలుసుకున్న నగరప్పాలెం, బండిపాలెం గ్రామాల రైతులు, యువకులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే మా వ్యవసాయ బోర్లు పనిచేయవని, పంటలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వందల అడుగుల లోతులో బోర్లు తీసి నీరు వినియోగిస్తే రైతుల పరిస్థితి ఏమి టని నిర్వాహకులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆర్వో ప్లాంట్ యాజ మాన్యానికి రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న జేఆర్‌పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివ రాలు తెలుసుకున్నారు. రైతులు, సంబంధిత యాజమాన్య ప్రతినిధులను పోలీసు స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుపై ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికా రులకు నివేదిస్తామని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి రైతులకు సూచించారు. దీంతో రైతులు తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు.

ఆదిత్యుని సేవలో గ్రామీణ బ్యాంకు చైర్మన్



చైర్మన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో

అరసవల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం అరుణ్ కుమార్, ఆర్‌ఎం అనంతరావు, బీఎం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కలిగించాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

గార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కలిగించాలని జడ్పీ సీఈవో డి.సత్య నారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన సాలిహుండంలో చెత్త నుం చి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేక రణ తీరును పరిశీలించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రఘు, సర్పంచ్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి కిషోర్‌బాబు


సోంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని ఎక్కువ కేసులను రాజీ చేయిం చుకోవాలని ఆరో అద నపు జిల్లా న్యాయాధికారి కోడూరు కిషోర్ బాబు కోరారు. కోర్టు ప్రాంగణంలో సోంపేట, బారువ, కంచిలి, మందస పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నా మన్నారు. స్టేషన్ పరిధిలో ఎన్ని కేసులున్నాయి, రాజీకి ఎన్ని కేసులున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్రీనివాసరావు, సోంపేట సీఐ మంగరాజు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నారీశక్తిపై అవగాహన

గార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నారీశక్తిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. శుక్రవారం అంపోలు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మహిళా రక్షణ చట్టాలు, శక్తియాప్, పోక్సోచట్టం, సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహనతో డయాబెటిస్ దూరం

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.మేరీ క్యాథరిన్



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అవగాహనతో డయాబెటిస్‌ను తగ్గించుకోవచ్చని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.మేరీ క్యాథరిన్ అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాంక్రియాస్ ద్వారా తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి జరగకపోతే, శరీరం దానిని సమర్థవంతంగా వినియోగించుకోలేదని, దీనినే మధుమేహం అంటారన్నారు. తగినంత బరువు కలిగి ఉండడం, ప్రతీరోజు అర గంట వ్యాయామం చేయడం, శారీరకంగా చురుకుగా ఉండాలన్నారు. తరచూ దాహం వేయడం, రాత్రి వేళల్లో మూత్ర విసర్జన, నీరసం, తిమ్మిర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మధుమేహంపై నిర్లక్ష్యం వహిస్తే ఇది శరీరంలోని అన్ని అవయవాలను దెబ్బ తీస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.రాందాసు, డా.రవీంద్ర, డా. జీవీలక్ష్మి, డా.సుజాత, రామనాగేశ్వరరావు, సత్యనారాయణ, మోహిని, డీపీవో ముళి, తదితరులు పాల్గొన్నారు.

డా.అన్నెపు శశిధర్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు



మందులు పంపిణీ చేస్తున్న డా.అన్నెపు శశిధర్

అరసవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా డా.అన్నెపు శశిధర్ ఆసుపత్రిలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శశిధర్ (ఎండీ జనరల్ మెడిసన్) మధుమేహం నివారణ, నిర్ధారణ, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీవనశైలిలో మార్పులు, స్క్రీనింగ్ ప్రాముఖ్యతలను, ఈ వ్యాధి నివారణోపాయాలను వివరించారు. రోగులకు మధు మేహవ్యాధి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బకాయిలను చెల్లించాలి

ఆమదాలవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాత పీఆర్సీ, డీఆర్ బకాయిలు తక్షణం చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో రిటైర్డ్ పర్సన్స్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకాయిలు చెల్లించకపోవడం వల్ల ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలపై మొండి వైఖరిని అవలంబిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దాస్యం లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటా

కవిటి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గొండ్యాలపుట్టుగకి చెందిన బైరెడ్ల రమేష్ ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఆదుకుంటానని కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ అన్నారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారులకు అండగా ఉండి వారికి ఉచితంగా విద్యను అందిస్తానన్నారు. ఆయన వెంట జనసైనికులు పి.శ్రీను, కె.జగదీష్ ఉన్నారు.

నేడు అభిషేకాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గొల్లవీధి ఎల్‌సీ గేట్ సమీపంలో చిదంబరేశ్వర ఆలయం పక్కన ఏర్పాటు చేసిన అభిషేకాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సాలిన గంగులు, గాంధీ కుటుంబ సభ్యులు స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారన్నారు. ఉదయం మహాదీప స్థాపన, మండల పూజ, మహాస్నానం, హోమాలు, పూర్ణహుతి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపడుతున్నామన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

ఎచ్చెర్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జీఎస్ రాయ్, రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ ఎల్.విజయ అన్నారు. పొన్నాడ, ధర్మవరం గ్రామాల్లో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'లో భాగంగా వరి, మొక్కజొన్న, చోడి, అపరాల పంటలపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. పంటల సాగులో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడీఏ బి.రేవతి, ఏవో వి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట జాబితాల ప్రదర్శన



జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

ఆమదాలవలస, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివ రాలను పారదర్శకత, సామాజిక తనిఖీకి అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంట జాబితాలను ప్రదర్శించినట్టు జిల్లా వ్యవసాయాధికారి మనోహర్‌రావు తెలిపారు. రైతులు తమ పేర్లు, భూమి వివ రాలు, పంట రకాల సాగు విస్తీర్ణం తదితర అంశాలను ఈ జాబితాల్లో పరిశీలించాల న్నారు. ఈ సామాజిక తనిఖీ రైతులకు కలిగే ప్రయోజనాలు, పథకాలు అమలులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఏవో మెట్ట మోహన్‌రావు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓజేటీ కేంద్రాల తనిఖీ



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీవీఈవో, సభ్యులు

గుజరాతీపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వృత్తివిద్యా కోర్సుల శిక్షణ కేంద్రాలను జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి రేగ సురేష్ కుమార్ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం మూడు కళాశాలలకు సంబంధించి ఐదు శిక్షణా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంఅండ్‌ఏటీ విభాగానికి చెందిన విద్యార్థులు శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్ షాప్‌ను సందర్శించారు. జిల్లా కేంద్రంలోని వివిధ ఆసుపత్రుల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్టీ కోర్సుల ఓజేటీల సరళిని పరిశీలించారు. డీవీఈవోతోపాటు కమిటీ సభ్యులు ఎంఎఎస్ శ్రీనివాస్, గణపతి వెంకటేశ్వరరావు, ఎం. కృష్ణవేణి, అధ్యాపకులు జె.రవిబాబు, ప్రసాద్, రాజశేఖర్, కిరణ్, రవిశంకర్, సుష్మాశ్రీ, ఎం.లక్ష్మి, కోటేశ్వరరావు ఉన్నారు.

వృత్తిపరమైన మెలకువలు నేర్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పర్యవేక్షణాధికారి శరత్‌బాబు

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వృత్తిపర మైన మెలకువలు నేర్చుకోవాలని ఓజేటీ (ఆన్ ద జాబ్ ట్రైనింగ్) ఇంటర్మీడియట్ జిల్లా పర్యవేక్షణాధికారి చింతాడ శరత్‌బాబు అన్నారు.

శుక్రవారం బాలిక జూనియర్ కళాశాల ఎంపీహెచ్‌డబ్ల్యూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు సీహెచ్‌సీలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత శిక్షణను విద్యార్థినులు సవాల్‌గా తీసుకొని భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, ఏజీఎంవో పి.సుధాకర్, అధ్యాపకులు శాంతిశ్రీ, లత, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై ధర్మాన వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

అరసవల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను నిర్మిం చడంపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని టీడీపీ నగర అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ఖజానాను పూర్తిగా దివాళా తీసి, అప్పుల్లో ముంచేశారని విమర్శించారు. ఒక్క మెడికల్ కాలేజీని నిర్మించలేక పోయారని, నేడు రాష్ట్రంలో 15 మెడికల్ కాలేజీల నిర్మాణం రానున్న రెండు ఏళ్లలో పూర్తి కానుందన్నారు. దీంతో రాష్ట్రంలో 200 పైగా ఎంబీబీఎస్ సీట్లు అదనంగా వస్తాయన్నారు. అయితే ఈ నిజాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూకళ్ల శ్రీనివాసరావు, ప్రధాన విజయరాం, పాండ్రంకి దేవేంద్రనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం.వైకుంఠరావు తెలిపారు. బేస్‌బాల్ అండర్-19 విభాగంలో సమీరా బిసాయి, నౌపడ ఝాన్సీ అంజలి బిసాయి ఎంపికయ్యారన్నారు. శనివారం నుంచి 17వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థినులను పాఠశాలలో ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భర్త చితికి తలకొరివి పెట్టిన భార్య



తలకొరివి పెడుతున్న భార్య రోహిణి



లక్ష్మణరావు(ఫైల్)

కోటబొమ్మాళి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ అన్యోన్య దంపతులు.. కష్టసుఖాల్లో ఒకరినొకరు తోడుగా నిలిచి జీవనం సాగించేవారు. ఇంతలో విధివారి బంధాన్ని విడదీసింది. దీంతో భర్త చితికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుంజిలోవ గ్రామానికి చెందిన తిర్లంగి లక్ష్మణరావు(35) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా.. శుక్రవారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. లక్ష్మణరావుకి భార్య రోహిణితో పాటు నిండా పదేళ్లు నిండని ఇద్దరు కుమారులు, వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఉన్నారు. దీంతో ఏడడుగులు నడిచినా భార్య- అన్నితానై భర్త అంతిమయాత్రలో పాల్గొని చితికి నిప్పు పెట్టింది. ఆమె అర్తనాదాలు అపడం ఎవ్వరి వల్ల కాలేదు. కోటబొమ్మాళిలో చికెన్ దుకాణం నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు.

అమెరికాలో కొత్తపేటవాసి మృతి



రమేష్(ఫైల్)

కోటబొమ్మాళి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామానికి చెందిన సుంకరి రమేష్(40) అమెరికాలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. రమేష్ సుమారు 10ఏళ్లుగా అమెరికాలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుప్రతిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన వివాహిత సుజాత అదృశ్యంపై ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నంలో నివాసం ఉంటున్న సుజాత తన అక్క సుమతికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో సపర్యలు చేసేందుకు ఈ నెల 2న శ్రీకాకుళం వచ్చింది. తిరిగి 4వ తేదీ మధ్యాహ్నం విశాఖలో ఉన్న తన భర్త వద్దకు వెళ్లిపోతానని చెప్పడంతో.. సుమతి భర్త ద్విచక్ర వాహనంపై సుజాతను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దించి వెళ్లిపోయాడు. రాత్రి అయినా సుజాత ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త శ్రీకాకుళంలో ఉన్న సుజాత అక్క, బావలకు ఫోన్ చేసి అడిగడంతో విషయం బయటపడింది. దీంతో ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో సుజాత తల్లి సవర చిలకమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

మత్స్యకారుల మధ్య కొట్లాట

● నలుగురికి గాయాలు

ఇచ్ఛాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బూర్జుపాడు పంచాయతీ డొంకూరు గ్రామంలో మత్స్యకారుల్లో రెండు వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చెలరేగడంతో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండ నీలాద్రి అనే వ్యక్తి తన బోటులో సముద్రంలో వేటకు వెళ్లి చేపలను తెచ్చుకున్నాడు. వాటిని ఓ షెడ్‌లో భద్రపరిచాడు. ఎస్.దేవ, చీకటి దుర్యోధన, బడే ఎర్రయ్య తదితర మత్స్యకారులు అక్కడికి వచ్చి షెడ్‌లో నీలాద్రి దాచుకున్న చేపలను బయటపడేశారు. ఈ విషయం తెలుసుకున్న నీలాద్రి వర్గానికి చెందిన బుడ్డ సన్యాసి, కొండా నీలాద్రి, కొండా ప్రేమ్‌కుమార్, బి.ఢిల్లీరావు, కె.కృపారావు, బి.పాపయ్య, బి.రాజు తదితరులు అక్కడికి చేరుకుని వారిని నిలదీశారు. ఈ ఘటనను నీలాద్రి వర్గానికి చెందిన వారు వీడియో తీసేందుకు ప్రయత్నించగా.. మరో వర్గం వారు సెల్‌ను తీసుకుని 'మాపైనే పోలీస్ స్టేషన్‌కు వెళ్తారా' అంటూ దాడి చేశారు. దీంతో బి.సన్యాసి, బి.రాజు, కె.ప్రేమ్‌కుమార్, పి.కృష్ణారావు గాయపడ్డారు. పట్టణ ఎస్‌ఐ ముకుందరావు, కవిటి ఎస్‌ఐ రవివర్మ ఇరు వర్గాలతో చర్చించి సర్ది చెప్పారు. గాయపడిన మత్స్యకారులను ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

కల్వర్టు బాగుచేయండి



ప్రమాదకరంగా మారిన కల్వర్టు

కాశీబుగ్గ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు పెద్ద బ్రాహ్మణవీధి ప్రధాన ముఖద్వారం వద్ద కాలువపై ఉన్న కల్వర్టు సిమెంట్ ప్లేటుకు రంధ్రం పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో కురిసన పెద్ద వర్షాలతో పాటు అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో సిమెంట్ ప్లేట్‌కు రంధ్రం పడింది. ముఖ్యంగా రాత్రి పూట ఆ రంధ్రాన్ని పరిశీలించకపోతే ద్విచక్ర వాహనాల టైర్లు రంధ్రంలోకి దూరి వాహన చోదకులకు ప్రమాదం జరిగే అవకాశం కలదు. ఇప్పటికే నలుగురు, ఐదుగురు ఈ రంధ్రంతో ప్రమాదానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి రంధ్రానికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాల బారి నుంచి రక్షించాలని పెద్దబ్రాహ్మణవీధి వాసులు కోరుతున్నారు.

మురుగు నీటితో అవస్థలు



అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా మురుగునీరు

పోలాకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గుప్పెడుపేట తుఫాన్ షెల్టర్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-3 ఎదురుగా మురుగునీరు ప్రవహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారుల కోసం మరుగుదొడ్డి నిర్మించారు. కాని మరుగుదొడ్డి గదికి వెళ్లే దారి బాగులేకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశ్నించగా గ్రామపెద్దలకు, సచివాలయ సిబ్బందికి ఎన్నోసార్లు తెలియజేసినా ఎవరూ స్పందించలేదన్నారు. వైద్యసిబ్బంది వచ్చి మందలించారని కాని మురుగునీటి పారుదల ఆగలేదని, దుర్గంధ వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడపాల్సి వస్తుందన్నారు. కేంద్రానికి 20 మంది చిన్నారులు వస్తున్నారని కార్యకర్త తెలిపారు. ఎంపీటీసీ పైడమ్మ, సర్పంచ్ పైడి రాధను ప్రశ్నించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెత్త సమస్యకు పరిష్కారం

● ఆధునిక యంత్రాలతో ప్లాస్టిక్ తొలగింపు
● ఎరువుగా మిగిలిన వ్యర్థాలు
● పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రయోగం
● జిందాల్ కంపెనీతో ఒప్పందం



జిందాల్ సంస్థ ఇతర జిల్లాల్లో చెత్తను వేరు చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రం

పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటిలో ప్రతి రోజూ 50 టన్నుల వరకూ చెత్త పోగవుతోంది. దీన్ని మున్సిపాటికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీఎంఈ కాలనీకి సమీపంలో గల 11 ఎకరాల డంపింగ్ యార్డులో నిల్వ చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నా సిబ్బంది లేకపోవడంతో మొత్తం చెత్త మున్సిపాలిటికి పెద్ద అవరోధంగా మారింది. ప్రస్తుతం 11 ఎకరాల స్థలంలో చెత్త అంతా నిండిపోయి వాటిని ఎక్కడ పారబోయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి ఆధునిక యంత్రాలతో ప్లాస్టిక్, విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన సామగ్రిని వేరుచేయడానికి విశాఖ వద్ద ఉన్న జిందాల్ కంపెనీ ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఆ కంపెనీ ఆధ్వర్యంలో విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో ఉన్న మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డులను నిర్వహిస్తుంది. యార్డులో ఉన్న చెత్తంతా యంత్ర పరికరాల ద్వారా వేరుచేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ చెత్త రహిత డంపింగ్ యార్డులను చేస్తోంది. ఆ విధానాన్ని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటిని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు సంబంధించిన పనులను త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే జిందాల్ కంపెనీ ప్రతినిధులు మున్సిపాలిటిలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించి చెత్త వేరుచేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. యంత్రాలు బిగించేందుకు, సిబ్బంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని కోరడంతో అధికారులు అందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. చెత్తలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంతో వాటిని పనికి వచ్చే వస్తువుగా సంబంధిత కంపెనీ ప్రతినిధులు గుర్తించారు. వ్యర్థాలు, మట్టి, ప్లాస్టిక్ ఇలా మొత్తం మూడు విభాగాలుగా దీన్ని యంత్రాలతో విభజిస్తాయి. అందులో మట్టిని పంట పొలాలు, తోటలకు తరలించే ఏర్పాటు చేస్తారు. మిగిలిన వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర పనికివచ్చే వ్యర్థాలను జిందాల్ కంపెనీకి తరలిస్తారు. ఈ విధానం మొదలయితే మున్సిపాలిటీలో ఉన్న డంపింగ్ యార్డు పరిస్థితి మారే అవకాశాలు ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇది విజయవంతం అయితే జిల్లాలో ఉన్న శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో ఈ విధానాన్ని అవలంబించే అవకాశం ఉంది.

ఇది శుభ పరిణామం

డంపింగ్ యార్డులో చెత్తను ఏ విధంగా వినియోగించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. ఈ క్రమంలో జిందాల్ కంపెనీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెత్తను సేకరించేందుకు ముందుకు రావడం శుభపరిణామం. 50 రోజుల్లో మొత్తం చెత్త అంతా తొలగించేందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించారు.

- ఎన్.రామారావు, మునిసిపల్ కమిషనర్



ఆస్ట్రేలియా ప్రతినిధులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

విశాఖ సదస్సులో ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం/ నరసన్నపేట/ పాతపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్‌లో శుక్రవారం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట, పాతపట్నం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు తదితరులు హాజరయ్యారు.




సదస్సులో పాల్గొన్న ఎచ్చెర్ల, పాతపట్నం ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, మామిడి గోవిందరావు



సమ్మిట్‌లో పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

బదిలీపై వెళ్లినా.. వారిపేర్లే!



నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన వారి పేర్లే బోర్డుపై దర్శనమిస్తున్నాయి. పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన ద్వారం వద్ద గోడపై పొందుపరిచి ఉన్న వైద్యులు ఎస్.చలమయ్య, కె.అనితకుమారి ఇతర ప్రాంతాలకు గతంలో బదిలీపై వెళ్లగా.. డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ కె.లీల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అయినా నేటికీ వారిపేర్లే ఆ బోర్డుపై దర్శనమివ్వడం విశేషం. దీనిపై పలువురు ప్రశ్నించుకోవడం కనిపించింది. ఇప్పటికైనా ఆయా పేర్లను మార్చుచేసి విధుల్లో ఉన్నవారి పేర్లు బోర్డులో పొందుపరచాలని పలువురు కోరుతున్నారు.

← బదిలీపై వెళ్లిన వారి పేర్లుతో ఉన్న బోర్డు

నగరంలో ట్రాఫిక్ డైవర్షన్



కృష్ణా పార్కు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణాపార్క్ వద్ద కల్వర్టు పనులు చేపడుతున్నందున వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ వానపల్లి రామరావు తెలిపారు. శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు కల్వర్టు పనులు చేపట్టనున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వైపు వెళ్లే భారీ వాహనాలు డే అండ్ నైట్ జంక్షన్ మీదుగా ఇలిసిపురం జంక్షన్, రామలక్ష్మణ, సూర్యమహల్, అరసవల్లి మిల్లు జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లే భారీ వాహనాలు ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాతబ్రిడ్జి మీదుగా పీఎన్‌కాలనీ వైపు నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ చేరుకోవాలని ఆయన సూచించారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా



హైవేపై బోల్తాపడిన లారీ

శ్రీకాకుళం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాత్రునివలస డెంటల్ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం లారీ బోల్తాపడింది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుంచి భువనేశ్వర్ వైపు వెళుతున్న లారీ ఉదయం ఐదు గంటల సమయంలో అదుపు తప్పి రోడ్డుపై పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే అతడిని స్థానికులు, హైవే సిబ్బంది ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి హైవే పెట్రోలింగ్ సిబ్బంది చేరుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. లారీని క్రేన్ సాయంతో అక్కడి నుంచి తొలగించే చర్యలు చేపట్టారు.

లోలుగు కేజీబీవీలో డీఎస్పీ విచారణ



సిబ్బందిని విచారిస్తున్న డీఎస్పీ వివేకానంద

పొందూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోలుగు కేజీబీవీలో శుక్రవారం శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విచారణ చేపట్టారు. మూడు నెలల కిందట కేజీబీవీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇంటర్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారించారు. ప్రిన్సిపాల్ లలితకుమారి, ఏపీసీ శశిభూషణరావు దూషణల కారణంగానే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై డీఎస్పీ వివేకానంద పాఠశాలలో ఉపాధ్యాయులను, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులను పలు విషయాలను అడిగి తెలుసు కున్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తదితరులున్నారు.

కమిటీ పరిశీలించాకే భక్తులకు అనుమతి

పలాస, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రిసభ్య కమిటీ చేసిన సూచనలు అమలు చేసిన తర్వాత, మరోసారి కమిటీ పరిశీలించాకే భక్తులకు ఆలయ ప్రవేశానికి అనుమతులు ఇస్తామని కాశీబుగ్గ డీఎస్పీ లక్ష్మణరావు స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్తీక ఏదాదశినాడు ఆలయంలో జరిగిన తొక్కిసిలాటలో తొమ్మిది మంది మరణించిన తర్వాత ఆలయాన్ని మూసివేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఆలయంలో సీసీ కెమెరాలు, పటిష్ఠమైన రైలింగ్, భద్రత కల్పించాలని సూచనలు చేయడంతో ఆలయ నిర్వాహకులు ముకుంద పండా పనులు చురుకుగా చేస్తున్నారన్నారు. మొత్తం పనులు పూర్తయిన తరువాత రెవెన్యూ, పోలీసులు, మున్సిపాలిటి, దేవదాయశాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలిస్తారని, అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆలయంలో దేవతామూర్తులకు పూజలు, కైంకర్యాలు నిర్వాహకులు ఒక్కరికే అవకాశం కల్పించినట్టు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

హరిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడార్సింగి పంచాయతీ సవర పద్మాపురం గ్రామంలోని అగ్ని ప్రమాద బాధితులకు హరిపురం కోస్టల్ లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసరాల పంపిణీ చేపట్టారు. ఇటీవల అగ్ని ప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు లక్ష్మణరావు, కె.ప్రతాప్ మాట్లాడుతూ.. ఆపదలో ఆదుకొనే చేతులు ముందుకు రావాలని కోరారు. పుల్లా వాసు తదితరులు పాల్గొన్నారు.

రేపు కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సు

హరిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న శ్రీకాకుళం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా క్రిష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా హరిపురం మార్పు గ్రంథాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కోత ధర్మారావు, ఆంధ్రా వర్సిటీ ప్రొఫెసర్ ఎన్‌డీపీ పాల్, కె.కృష్ణ, హేమారావు చౌదరి, నల్ల హడ్డీ, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో సెట్‌శ్రీ ఆధ్వర్యంలో గురజాడ గాయత్రీ కళాశాలలో జరిగిన యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జానపదనృత్య పోటీల్లో పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు తెలిపారు. ఈ ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. శుక్రవారం వారిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి



ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల కొండపల్లిలో శుక్రవారం గ్రామ దేవత కొండమహంకాళి అమ్మవారు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను గ్రామపుర వీధుల్లో ఊరేగింపు చేపట్టగా.. మహిళలు కళశాలతో అనుసరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. శనివారం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ యజ్ఞ, యాగాదులతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో, బయట పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌వీసీటీ, పడాల చారిటిబుల్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం అవగాహన కల్పించారు. బాలలు పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. కార్యక్రమంలో రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్లేట్లు వితరణ

నందిగాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): లగిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు మధ్యాహ్న భోజన ప్లేట్లను వితరణగా ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 96మంది విద్యార్థులకు విద్యా కమిటీ చైర్మన్ సీతారాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.దాలయ్య, డి.శ్రీనివాస్, బి.రత్నం, రామారావు, త్రినాథస్వామి తదితరులు ఉన్నారు.

వ్యర్థాలు తొలగింపు

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుల్లో గల డంపింగ్ యార్డులో చెత్తవాహనాలు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో పంచాయతీ అధికారులు స్పందించి మార్గం సుగమం చేశారు. యార్డులో వ్యర్థాలు పేరుకుపోవడంతో చెత్త వాహనాలు వెళ్లక రోడ్డు మీద చెత్త డంపింగ్ చేసేవారు. సర్పంచ్ శంకరరావు, ఉప సర్పంచ్ కృష్ణబాబు స్పందించి చెత్త రోడ్ల మీదకు రాకుండా డంపింగ్ యార్డు పనులు చేపట్టారు. ఈవో ద్రాక్షాయిణి తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో నీరు ఆదా

నరసన్నపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు ఆరుతడి పంటలు సాగుచేయడం ద్వారా నీరు ఆదా చేయవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు, వై.సురేష్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ డివిజన్ కేంద్రంలో రబీలో అరుతడి పంటలు సాగుపై జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. రబీలో అపరాలు, వేరుశెనగ, నువ్వులు, మొక్క జొన్న పంటలు వేసేలా రైతులకు అవగాహన చేయాలన్నారు. ఏడీఏ వెంకటమధు, ఏవోలు సూర్యకుమారి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రయోజనం

పోలాకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మానవుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి ఆరోగ్యకేంద్రం వద్ద నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాల వల్ల పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బగ్గు అర్చన, ఎంవీ నాయుడు, కిల్లి వేణు, హరికృష్ణ, వైద్యాధికారులు శ్రీనాథ్, సుమప్రియ, విస్తరణాధికారి నల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పోలాకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి గ్రామంలో షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబా ఉత్సవమూర్తిని పల్లకిలో గ్రామప్రదక్షిణ చేశారు. బాబా వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఆలయ అర్చకులు జడా సాయిదాలయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

సేవలతోనే గుర్తింపు

ఎల్ఎన్ పేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందిస్తున్న సేవలతో ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఎంపీడీవోగా పదోన్నతిపై వెళ్లిన ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పనిచేస్తే ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారన్నారు. పలువురు కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.